క్లుప్తంగా

పేదల సంక్షేమానికి కృషి చేసిన ముఖ్యమంత్రి

త్రిపురాంతకం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల సంక్షేమానికి అగ్రస్థానం ఇచ్చిందని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. త్రిపురాంతకంలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన పెన్షన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులకు సామాజిక పెన్షన్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ అభివృద్ధికి ముఖ్యమంత్రి కట్టుబడి పనిచేశారని, అంతా ఆయనకు మద్దతుగా నిలవాలన్నారు. ఎంపీడీఓ సాంబశివరావు, ఈఓఆర్డీ మురళీమోహన్, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ ఆళ్ల కృష్ణారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ బృందం తనిఖీలు



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

పొదిలి: విద్యుత్ అక్రమంగా వినియోగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ ఈఈ ఎస్‌డీ కరీం హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ ఈఈ తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 45 బృందాలు దాడులు నిర్వహించాయి. 3621 గృహ సర్వీసులు, 113 వాణిజ్య సర్వీసులను తనిఖీలు చేసినట్లు అధికారులు చెప్పారు. 33 సర్వీసులు అధిక లోడు ఉపయోగిస్తున్నట్లు గుర్తించి రూ.1.77 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. అక్రమంగా విద్యుత్ వినియోగించుకుంటున్న 9 సర్వీసులను గుర్తించి రూ.లక్ష జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో డీఈ శ్రీనివాసరెడ్డి, దర్శి డివిజన్ డీఈలు, ఏఈలు, విజిలెన్స్ డీఈ, ఏఈ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ పేరయ్య

ముండ్లమూరు: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆ శాఖ పీడీ పేరయ్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పూరిమెట్లలో బుధవారం జగనన్న లేఔట్‌ను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఔట్‌లో 42 ఇళ్లు మంజూరు కాగా అందులో 19 ఇళ్లు మాత్రమే పనులు జరుగుతండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం విడనాడి లబ్ధిదారులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. మిగిలిన వారందరూ ఇంటి పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ లబ్ధిదారులను నేరుగా కలిసి ఇంటి పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. నిర్మాణ దశ ఆధారంగా బిల్లులు చెల్లించాలన్నారు. ఇకపై రోజు వారి ప్రగతి నివేదికలు ఇవ్వాలన్నారు. ఆయన వెంట డీఈ నిరీక్షణరావు, ఏఈ హనుమంతరావు ఉన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమేష్

పెద్దారవీడు: పేద ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని సర్పంచ్ గుడ్డెపోగు రమేష్ అన్నారు. మండలంలో సుంకేసుల సచివాలయంలో నూతన రేషన్‌కార్డులు, చెత్త బుట్టలు, క్రీడాకారుల టీ షర్టులు బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పీఎస్ ఆర్.పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ మండల కమిటీ సభ్యులు గుర్రం ముత్యాలయ్య, ఆవుల నాగిరెడ్డి, ఎఫ్‌ఏ సానికొమ్ము మల్లారెడ్డి, సచివాలయ ఉద్యోగులు కె.శ్రీనునాయక్, పురుషోత్తం, ఎస్.వెంకటేశ్వర్లురెడ్డి, టి.మౌనిక పాల్గొన్నారు.

ఉత్సాహంగా నూతన పింఛన్ల పంపిణీ



పింఛను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ నగేష్‌కుమార్

మార్కాపురం టౌన్: పట్టణంలోని వివిధ సచివాలయాల పరిధిలో బుధవారం నూతనంగా మంజూరైన పింఛన్లను కౌన్సిలర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, 27వ బ్లాక్ కౌన్సిలర్ కశ్శెట్టి నగేష్‌కుమార్, 16వ బ్లాక్ కౌన్సిలర్ దారివేముల హర్షిత, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ గుంటక వనజాక్షి చెన్నారెడ్డి నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.



దర్శిలో ఎడ్ల పందేల ప్రాంగణం ఇదే..



పోటీలను తిలకిస్తున్న ప్రముఖులు, నాయకులు



ప్రారంభమైన పందేలు

ఒంగోలు రాజసం

దర్శి: జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు బుధవారం దర్శిలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



కార్యకర్తలను ఉత్సాహ పరుస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ



సభ ప్రాంగణంలో ఓ వైపు హాజరైన జనం



గొట్లగట్టులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



బేస్తవారిపేట: మహిళల కబడ్డీ పోటీలు



ముండ్లమూరు: క్రీడాకారులతో వైఎస్సార్ సీపీ నాయకులు



పొదిలిలో క్రీడాకారులతో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, నాయకులు

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆర్‌సీఎం పాఠశాలలో ఆడుదాం.. ఆంధ్రా క్రికెట్, ఖోఖో పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి రిబ్బన్ కట్ చేసి ఆటలు ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులతో ఎంపీపీ ఉషామురళి, తహసీల్దార్ సువర్ణ, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఎంఈఓ ఎస్.సాంబశివరావులు పరిచయం చేసుకున్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో 4 టీమ్‌లు ఖోఖో, ఆర్‌సీఎంలో 28 టీమ్‌లు క్రికెట్ ఆడాయి. వారం క్రితం సచివాలయాల పరిధిలో నిర్వహించిన ఆటల్లో విజేతలైన వారికి పోటీలు నిర్వహిస్తున్నామని వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నరసింహారావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు పి.కృష్ణమూర్తి, ఎం.శ్రీనివాసులు, నాగార్జున్ పాల్గొన్నారు.

కురిచేడు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం వయో భేదం లేకుండా గ్రామీణస్థాయి నుంచి క్రీడానైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కుసుమ కుమారి తెలిపారు. మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులతో ముందుగా గ్రామంలో ర్యాలీ చేశారు. ఆవులమంద, కురిచేడు, పెద్దవరం, బోధనంపాడు గ్రామస్థాయి క్రీడాకారులతో క్రికెట్ ఆటను సర్పంచ్ కృష్ణయ్య, ఎంపీడీఓ కుసుమకుమారి, ఎంఈఓ వస్త్రాంనాయక్‌లు ఆడి ప్రారంభించారు.

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో, సలకలవీడులో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. తహసీల్దార్ డీవీబీ వరకుమార్, ఎంపీడీఓ పార్వతిలు ఆటల పోటీలు ప్రారంభించారు.

పెద్దారవీడు: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల్లోని నైపుణ్యతను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆటల పోటీలు నిర్వహిస్తోందని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిధిలో ఏనుగులదిన్నెపాడు జెడ్పీహెచ్ పాఠశాలలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను సర్పంచ్ బలుసుపాటి లూథియా ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. సర్పంచ్‌లు పాలగిరి రామాంజనేయరెడ్డి, గుడ్డెపోగు రమేష్, ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఎంఈఓ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు



వై.పాలెం: కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

బలుసుపాటి నాగరాజు, కీరానాయక్, హెచ్‌ఎం అహ్మద్‌బాషా, విశ్రాంతి హెచ్‌ఎం ఏర్వ వెంకటరామిరెడ్డి, పీఈటీలు శివనాగరాజు, దేవండ్ల చంద్ర పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు మనలో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకు ఉపయోగపడతాయన్నారు. క్రికెట్ క్రీడాకారులను ఆయన ప్రోత్సహించారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభమైన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పాల్గొన్నారు. పోటీలను ఎంపీపీ గుమ్మా పద్మజ, సర్పంచ్ చిత్తూరి హారిక, ఎంపీడీఓ నాసరరెడ్డి, పంచాయితీ కార్యదర్శి మోహనరావు, ఫిజికల్ డైరెక్టర్ రామానాయక్‌తో పాటు పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్లో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు ఉత్సాహంగా సాగాయి. చింతగుంట్ల–బోడపాడు జట్ల మధ్య కబడ్డీ, గజ్జలకొండ–భూపతిపల్లి జట్ల మధ్య క్రికెట్ పోటీలు, వేములకోట–గజ్జలకొండ జట్ల మధ్య బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సచివాలయాల కార్యదర్శులు, ఫిజికల్ డైరెక్టర్లు పోటీలను పర్యవేక్షించారు.

పొదిలి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. క్రీడలను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా పోటీలకు సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. నగర పంచాయతీ కమిషనర్ డేనియల్ జోషెఫ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జి.చెన్నారెడ్డి, పట్టణ కన్వీనర్ నూర్జహాన్, గూడూరి వినోద్, కల్లం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. సచివాలయ స్థాయిలో సత్తాచాటిన జట్లు మండల స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొన్నాయి. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఇతర పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ ప్రసాద్‌బాబు, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, సర్పంచ్‌లు పల్నాటి బోడయ్య, మద్దు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు బ్రహ్మయ్య, చుంచు సుధాకర్, జ్యోష్యులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం..ఆంధ్రా ఆటల పోటీలు యువతలో ఉత్తేజాన్ని నింపుతున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో బుధవారం మండల స్థాయి ఆడుదాం..ఆంధ్రా ఆటల పోటీలను అధికారులతో కలిసి ప్రారంభించారు. మండల స్థాయి ఆటల పోటీల్లో పసుపుగల్లు క్రికెట్ జట్టు మొదటి లీగ్ మ్యాచ్‌లో గెలిచి సెమీఫైనల్‌కి చేరుకుంది. ఎంపీడీఓ శంకరరావు, ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు సురేష్‌రెడ్డి, శ్రీనివాసరావు, పీఈటీలు రాముడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అర్ధవీడు (కంభం): ఆడుదాం ఆంధ్రా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఎంపీపీ వెంకట్రావు అన్నారు. గురువారం మండల స్థాయిలో జరుగుతున్న పోటీలను ఆయన ప్రారంభించారు. సచివాలయాల స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లు బుధవారం నుంచి ప్రారంభమై మండల స్థాయి పోటీల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆటగాళ్లకు కిట్‌లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ, మండల కన్వీనర్ చేగిరెడ్డి పోతిరెడ్డి, ఎంపీడీఓ మస్తాన్‌వలి పాల్గొన్నారు.



అర్ధవీడు: కిట్‌లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కొమరోలు: క్రీడలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ నరసయ్య, ఎంపీటీసీలు సుభాని, తిరుమలరాజు, నాయకులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వాలీబాల్, చినారికట్ల జెడ్పీ ఉన్న పాఠశాలల మైదానంలో క్రికెట్ పోటీలు బుధవారం నిర్వహించారు. పోటీలను ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు ప్రారంభించారు. పోటీలను ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు. పోటీల్లో మొత్తం 180 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు.

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో హోరా హోరీగా జరిగాయి. పోటీల్లో వివిధ సచివాలయాల పరిధిలో ఉన్న క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. పోటీలను ఎంపీడీవో వైవీ నాగేశ్వర ప్రసాద్, ఎంఈవో పి.ఆంజనేయులు, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడలను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.



పెద్దారవీడు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు



కురిచేడు: క్రికెట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ కుసుమకుమారి



క్రీడలను ప్రారంభిస్తున్న చైర్మన్ వెంకట సుబ్బయ్య



దొనకొండ: క్రికెట్ ఆడుతున్న ఎంపీపీ ఉషామురళి



కొమరోలు: మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటనాయుడు

అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందిస్తున్న డాక్టర్ పద్మావతి, కమిషనర్ రవీంద్ర



వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న వైస్ చైర్మన్, కమిషనర్, అధికారులు

మార్కాపురం: రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని మార్కాపురం డివిజన్ డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా బుధవారం ఆమె అరవిందఘోష్ వీధి, ఏకలవ్య కాలనీల్లో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలతోపాటు ఉచితంగా మందులు అందిస్తున్నామని, అవసరమైన వారిని నెట్‌వర్క్ వైద్యశాలలకు పంపించి చికిత్స చే యిస్తామని తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీతో పేదల జీవితాలకు భరోసా లభించిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ రాహుల్, మున్సిపల్ కమీషనర్ రవీంద్ర, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జగనన్న సురక్ష కిట్లను అందించారు.

పొదిలి రూరల్: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని డాక్టర్ ఎం.సుగుణకుమార్ పేర్కొన్నారు. బుధవారం పొదిలి మండలంలోని మాదాలవారిపాలెం సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 350 మందిని పరీక్షించి మందులు అందజేశారు. పలువురికి కళ్లజోళ్లు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు మానస, జగదీష్, నాయకులు గుంటూరి నాగిరెడ్డి, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న నాయకులు, డాక్టర్లు

గిద్దలూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందరికీ అందుబాటులో వైద్యం లభిస్తోందని నగర పంచాయతీ వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే మంచి ఉద్దేశంలో జగనన్న ప్రభుత్వం ఇటువంటి మహత్తర కార్యక్రమాలను ప్రవేశ పెడుతోందన్నారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, డాక్టర్లు సుమయా, భార్గవ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నంద్యా బాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కేసులు

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 44 మందిపై బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. విద్యుత్ విజిలెన్స్ డీఈ శ్రీనివాసులు, ఏఈ కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో దాడులు చేశారు. దాడుల్లో విద్యుత్ చౌర్యంకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారికి రూ.2,61.500 జరిమానాగా విధించారు.

విజయవాడ వెళ్లి దివ్యాంగుడికి పింఛన్ అందజేత



దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బీబీ జాన్‌బీ

యర్రగొండపాలెం: రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగి విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న దివ్యాంగుడు (మూగ)కు యర్రగొండపాలేనికి చెందిన వలంటీర్ కె.బీబీజాన్‌బీ బుధవారం పింఛన్ అందచేశారు. యర్రగొండపాలెంలోని కొండారెడ్డి కాలనీకి చెందిన సింగ సుబ్బయ్య దివ్యాంగుడు ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ పొందుతున్నాడు. గత నెలలో పింఛన్ తీసుకున్న అతను చెరుకు కోతలకు హనుమాన్ జంక్షన్ వెళ్లాడు. ఈ నెల 3వ తేదీన నిత్యావసర సరుకులు కొనుగోలు చేయటానికి వేరే వారి ద్విచక్రవాహనంపై ఎక్కి విజయవాడకు బయల్దేరాడు. ఈ సమయంలో ఆటో అమిత వేగంతో వెనక నుంచి వచ్చి ఢీ కొనడంతో పాటు సుబ్బయ్య కాళ్లమీద నుంచి వెళ్లింది. ఆ సంఘటనలో అతని రెండు కాళ్లు విరిగిపోయాయి. వెంటనే అతడిని విజయవాడలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వలంటీర్ బీబీజాన్‌బీ వెళ్లి అతనికి పింఛన్ అందచేశారు. ఆమెకు అధికారులతో పాటు లబ్ధిపొందిన సభ్యులు అభినందించారు.

ఎస్టీయూ వజ్రోత్సవాన్ని విజయవంతం చేయండి

మార్కాపురం: స్టేట్ టీచర్స్ యూనియన్ వజ్రోత్సవాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్లు రామచంద్రయ్య, ఎర్రయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం రాత్రి స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు రామాంజనేయులు, సీహెచ్‌పీ వెంకటేశ్వర్లు, శ్యామలాదేవి ఉన్నారు.

ప్రభుత్వం దృష్టికి ప్రజాసమస్యలు

● పాలకొండ ఎమ్మెల్యే కళావతి

బేస్తవారిపేట: క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు, ఆర్థిక అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఏపీ లెజిస్టేటివ్ అసెంబ్లీ అంచనాల కమిటీ చైర్మన్, పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. బుధవారం కర్నూల్, నంద్యాలలో పర్యటన ముగించుకుని మార్గ మధ్యంలో బేస్తవారిపేటలోని 98 డీఎస్సీ యూనియన్ రాష్ట్ర నాయకులు మోర్తాల బాలిరెడ్డి ఇంటికి ఆమె వచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు శాలువా, పూలమాలలతో ఎమ్మెల్యే కళావతిని సన్మానించారు. బడ్జెట్ కేటాయింపుతో కాంట్రాక్టర్లు జాప్యం లేకుండా సకాలంలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.ఈశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కళావతిని సత్కరిస్తున్న నాయకులు

అంబేడ్కర్ విగ్రహం రాష్ట్రానికి గర్వకారణం

త్రిపురాంతకం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ విజయవాడలో జరగనున్న సందర్భంగా సామాజిక సమత సంకల్పం కార్యక్రమం చేయడం గర్వకారణమని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దూపాడు సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో నిర్మించినట్లు పేర్కొన్నారు. విగ్రహాన్ని జనవరి 19న ఆవిష్కరించడం గర్వకారణమన్నారు. అంతా అంబేడ్కర్ ఆశయాలకు కృషి చేయాలని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సర్పంచ్ ఎనిబెర శైలజ, ఎంపీటీసీ శార, పీఎస్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆడుదాం ఆంధ్రా ఆటగాళ్లకు టీషర్టులు అందజేశారు.



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీ

కోడి పందేలు, పేకాట ఆడితే జైలుకే..

మార్కాపురం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే జైలుకు పంపుతామని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. పట్టణంతో పాటు గ్రామాల్లో నాటుసారా కాసినా, అక్రమంగా మద్యం అమ్మినా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కబడ్డీ జట్టుకు శిక్షణ

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి 22వ తేదీ వరకు అండర్–14 బాలుర రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు శిక్షణ ఇస్తున్నట్లు పాఠశాల పీడీ ఎం.బాలగురవయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె.వనజ తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న జట్టు ఈ నెల 24న జార్ఖండ్‌లో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల్లో ఏపీ తరపున ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు.